**న్యూజెర్సీ కథల పోటీలో రూ. 150/- లు గెలుచుకున్న రచన**

నాకెదురుగా చెట్టు క్రింద ఒక బిచ్చగాడు తన కుటుంబంతో కూర్చున్నాడు. ఆ రోజు అడుక్కొచ్చినదంతా పంచుకుని అందరూ 'భోజనం' చేస్తున్నారు. మధ్యలో నవ్వుకుంటున్నారెందుకో. నాకు కోపం వచ్చింది. ఈ మధ్య కాలంలో ఎవరు నవ్వినా నన్ను చూసే నవ్వుతున్నారనిపిస్తోంది. ఎవరేది మాట్లాడుకున్నా నా గురించే అనిపిస్తోంది. ఎవరు సంతోషంగా, తృప్తిగా కనిపించినా నాకు కోపం ఎక్కువైపోతుంది.

అందుకే వెంటనే లేచాను. పార్కు లోంచి ఇంటికి నడక సాగించాను. టైమ్ తొమ్మిదౌతోందేమో. నా దగ్గర వాచీ లేదు. ఎలక్ట్రిక్ లైట్లతో షాపులు కళకళలాడుతున్నాయి. ప్రపంచంలోని చీకటంతా నా మనసులో నిండినట్లనపించింది. అలవాటు ప్రకారం పుస్తకాల షాపు ముందు ఆగి 'ఎంప్లాయిమెంట్ న్యూస్' కొన్నాను. తర్వాత గుర్తొచ్చింది. నాకు ఈ రోజుతోనే అన్ని గవర్నమెంట్ ఉద్యోగాలకీ ఏజ్ బార్ అయిపోయిందని, తిరిగి ఇచ్చేస్తానంటే షాపు వాడు ఒప్పుకోడు. అది పుచ్చుకుని ఇంటికి చేరుకున్నాను. గేటు పాత వెదురుతో చేసింది కావడంతో కిర్రు మంటూ శబ్దం చేసింది. నులక మంచం మీద పడుకున్న నాన్న కళ్ళు తెరచి 'నువ్వేనా' అన్నట్లుగా ఓ సారి చూసి తిరిగి కళ్ళు మూసుకున్నారు. క్రింద కూర్చుని చిక్కుడు కాయలు ఈనెలు తీస్తున్న అమ్మ ఓసారి కళ్ళెత్తి చూసి తిరిగి తన పనిలో నిమగ్నమైపోయింది. తమ్ముడు లాంతరు పెట్టుకుని చదువుకుంటున్నాడు. బిల్లు కట్టకపోవడంతో ఈ మధ్య పవర్ సప్లై తీసేసారు. రాధ కనిపించలేదు. అడిగాను.

"ట్యూషన్లకెళ్ళింది నాయనా!" అంది అమ్మ, ఆ చెప్పటంలో నిరసన భావం వుంది. "పెద్దవాడివి నువ్వుండి నిండా పాతికేళ్ళు లేని పిల్ల సంపాదనతో ఇల్లు గడిపేలా చేస్తున్నావు" అన్న నింద వుంది. నేను భరించలేని మాట చెప్పాలంటే, 'నువ్వు చవటవి' అనే నిజం వుంది.

రాధ చాలా చురుకైనది. ఇంట్లో ఎలాంటి ప్రోత్సాహం లేకపోయినా అది బి.ఎ. మాథమేటిక్స్ చదివి ట్యుటోరియల్‌లో పాఠాలు చెప్తూ నాన్నగారు రిటైరయిన నాలుగేళ్ళుగా మమ్మల్నందర్నీ పోషిస్తోంది. అది మేనేజిమెంట్ లోనో, బిజినెస్‌లోనో అయితే మరింత సక్సెస్ అవుతుందని నా నమ్మకం - ఎందుకంటే దానికి తన పనులను ప్రయారిటీస్ ప్రకారం చేసుకోవటం తెలుసు. చాలా మెటీరియలిస్టిక్‌గా ఆలోచిస్తుంది. ఇంటర్లో దానికి బై.పి.సి. గ్రూపులో సీటు వచ్చింది. ఎం.పి.సి.లో కూడా వచ్చింది. అది మెడిసిన్ చదవాలని మా నాన్నగారి కోరిక. కాని రాధ ఒప్పుకోలేదు. "అన్ని సంవత్సరాలు చదువు మీద మనం ఖర్చు పెట్టలేం నాన్నగారూ! మేథమెటిక్స్ గ్రూపులో అయితే నెక్స్టు ఇయర్ నుంచి ట్యూషన్స్ చెప్పుకోవచ్చు" అంది. అలాగే చేసింది కూడా.

నేను ఇంటర్లో హెచ్.ఇ.సి., డిగ్రీలో పొలిటికల్ సైన్స్, ఎం.ఏ. ఫిలాసఫీ, రాధలా ట్యూషన్స్ చెప్పటానికైనా పనికిరాని సబ్జెక్ట్ నాది. జన సామాన్యానికి ఆసక్తి లేని, నిత్య జీవితంలో పనికిరాని ఇలాంటి సబ్జెక్ట్సులో యూనివర్సిటీలు డిగ్రీ లెందు కిస్తాయో, డిగ్రీలిచ్చినప్పుడు ఉద్యోగాలెందుకు ఇవ్వవో నా కర్థం కాదు. అన్నట్లు నాకు పి.హెచ్.డి. కూడా వుంది. రీసెర్చి చేసినన్నాళ్ళూ అందరూ కాస్త గౌరవంగా చూసేవాళ్ళు. ఫెలోషిప్ డబ్బులు వచ్చేవి కనుక.


ఎప్పుడూ ఆలోచించే ఈ విషయాలే మళ్ళీ, మళ్ళీ ఆలోచిస్తూ బుర్ర వేడెక్కిపోతూ వుంటే ఇంట్లోకి వెళ్ళాను. పాంట్, షర్ట్ విప్పి లుంగీ కట్టుకుని పెరట్లోకి నడిచేను. నాలుగ్గదుల పూరిల్లు, వెనకాతల బావి, ఇంటి చుట్టూ ముళ్ళ కంచె.

బావి దగ్గరకి వెళ్లి కాళ్ళు కడుక్కున్నాను. చుట్టూతా చిక్కుడు పాదులు, కరివేపాకు మొక్కలు, కొత్తిమీర మదులు. ఎలాగో మా ఇంట్లో చిక్కుడు పాదులు బాగా పెరిగాయి. కాసినన్నాళ్ళూ మా అమ్మ వాటి తోనే కూర చేస్తుంది- కూరల ఖర్చు లేకుండా.

అమ్మ భోజనానికి పిలిచింది. పీట మీద కూర్చున్నాను. కంచాల్లో అన్నం తింటే ఎలా వుంటుందో మర్చిపోయి చాలా ఏళ్ళయింది. పెరట్లో ఎప్పట్నించో వున్న బాదం చెట్టు ఆకుల్తో అమ్మ కుట్టే విస్తర్లూ, ఈ మధ్యే పెరిగిన అరటి చెట్టు ఆకులూ మమ్మల్ని రెండు పూట్లా ఆదుకుంటాయి.

మూకుట్లో మాడిపోయిన చిక్కుడుకాయ బొగ్గులు, గిన్నెలో అడుగంటిన అన్నం, అమ్మ మనసులోని నిస్పృహ వంటలోనే కాక వడ్డనలో కూడా కనిపిస్తోంది. చల్లటి చారు మీద కరివేపాకు అసహ్యంగా తేలుతోంది. నా కెందుకో ఆకలి చచ్చిపోయింది. భోజనం అయిందనిపించి లేచాను.

షర్ట్ వేసుకుని, బటన్స్ పెట్టుకుంటూ గేటు తీసుకుని బయటకి నడిచాను కాలనీ రోడ్డు దాటాక వచ్చే ఆంజనేయ స్వామి ఆలయం వైపు. కాంట్రాక్టరు రెడ్డి



# పాదాభివందనం

- ముదిగొండ కౌముది

గారు కట్టించారది. రెడ్డిగారు గొప్ప హనుమద్భక్తులు. ఆయనంటే అందరికీ గౌరవం. నేనూ రెడ్డినే. కాని రెడ్డి రాజుల కాలంలో అయితే నా పేరు 'సూర్యారెడ్డి' అని పెట్టుకునేందుకు నేను చాలా సంతోషించేవాడినేమో కానీ ఇప్పుడు కాదు. దీని మూలంగానే నాకు ఉద్యోగాలు రాకుండా పోతున్నది. షోల్డర్ బేగ్ భుజానికే వుంచుకుని రోడ్డు కెదురుగా నిశ్శబ్దంగా వున్న ఆలయం అరుగుమీద కూర్చున్నాను. అరిస్టాటిల్ - ప్లేటో- సోక్రటీస్ ఫిలాసఫీ గూర్చి, జిడ్డు కృష్ణమూర్తి తత్వాన్ని గురించీ, జీన్ పాల్ సార్త్రె ఎగ్జిస్టెన్షియలిజం గురించీ, ఇంకా చాలా మంది ప్రతి పాదించిన చాలా ఫిలాసఫీల గురించీ నేను అనర్గళంగా మాట్లాడగలను. కానీ నా ఈ అర్హతకి వచ్చే ఉద్యోగం ఏమిటి? భూమి గుండ్రంగా వుందన్నట్లు నా ఆలోచన లన్నీ తిరిగి తిరిగి వచ్చి మళ్ళీ ఈ ఉద్యోగం అనే పాయింట్ దగ్గరే ఆగిపోతున్నాయి. చిన్న తనం నుంచీ నాతో చదువుకున్న వాళ్ళందరికీ ఉద్యోగాలు వచ్చాయి స్టేట్ గవర్నమెంట్, సెంట్రల్ గవర్నమెంట్, నేషనలైజ్డ్ బ్యాంక్, ప్రైవేట్ కంపెనీ, హాస్పిటల్, ఫ్యాక్టరీ- క్లర్క్, ఆఫీసర్, లెక్చరర్, మేనేజర్, అడ్వొకేట్, ఇంజనీర్, డాక్టర్ టీచర్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్- రకరకాల ఉద్యోగాలు. ఈ 'ఉద్యోగం' అనే మాటకి ఎంత శక్తి వుందో నాకు ఇంకా బాగా అర్థం కాసాగింది ఆలోచించిన కొద్దీ. యూనివర్సిటీ లోంచి బయటకి వచ్చిన ప్రతి యువకుడికీ దీంతోనే విలువ వచ్చేది. కాపీ చేసి డిగ్రీ సంపాదించినా, పైరవీ చేసి ఉద్యోగం సంపాదించినా, సంస్కారం లేకపోయినా, ఉద్యోగం వుంటే చాలు యువకుడి రేటు పెళ్ళిళ్ళ మార్కెట్‌లో ఒక్కసారిగా పెరిగిపోతుంది. షేర్ మార్కెట్‌లో షేర్ల ధరల్లా అందరి చేతా గౌరవింపజేసేది ఉద్యోగం. మనిషి జీవితానికి తృప్తినీ, సంతోషాన్నీ, ఎవరి జీవితం మీద వారికి సార్వభౌమాధికారాన్ని ఇచ్చేది కూడా ఉద్యోగమే.

ఉద్యోగస్థుడు ఇంటికి రాగానే అందరూ చుట్టూతా చేరుతారు. "కాళ్ళు కడుక్కోండి" అంటుంది భార్య ప్రేమగా. "అన్నయ్యా! కాఫీ" అంటుంది చెల్లెలు ఆప్యాయంగా.

"అన్నయ్యకి టిఫెన్ పెట్టవే అలసిపోయి వచ్చాడు" అంటుంది అమ్మ ఆత్మీయంగా.

"ఇదిగో బాబూ! నువ్వు ఆరోగ్యం సరిగ్గా చూసుకోవడం లేదు. రేపటి నుంచీ రోజూ హార్లిక్స్ తాగాల్సిందే" అంటారు నాన్న అభిమానం, అధికారం, కుహనా కోపం మిళితమైన స్వరంతో. ఈ ప్రేమా, ఆప్యాయతా, అభిమానం, నెలకి పదిహేను వందల నుంచి రెండు వేల పైగా ఖరీదు చేస్తాయి మరి. ఆ జీవితం ప్లాస్టిక్ తీగ లాంటిది. ఈ కృత్రిమ ఆప్యాయతలు ఆ తీగకి పూసే పూలు. ప్లాస్టిక్ పూల తీగలా బతకాలని ఎవరి కుంటుంది? కాని ఉండక తప్పడం లేదు ఎవరికీ.

హఠాత్తుగా నా దృష్టి బ్రతకడం మీదకి మళ్ళింది. నేనెందుకు బ్రతుకుతున్నాను? ముప్పై అయిదేళ్ళు వచ్చాయి. ఇన్నేళ్ళుగా నిరుద్యోగిని. ముదిరిపోయిన బ్రహ్మచారిని. ఇంట్లో వాళ్ళకి పనికిరాని వాడిని. నాకు చాకచక్యంగా మాట్లాడడం రాదు- సేల్స్ మాన్ ఉద్యోగం చేద్దామంటే. ఇన్నేళ్ళూ నాకు గవర్నమెంట్ ఉద్యోగాలు రాలేదు, ఇక ముందు రావు. ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలకి నా డిగ్రీలు పనికిరావు. నాకు మోసం చేయడం కూడా రాదు వ్యాపారం చేద్దామంటే. అన్ని రకాలుగా చేతకాని వాడిని. లోకం దృష్టిలో బాధ్యత లేని వాడిని. గడచిన పదిహేనేళ్ళలాగానే రాబోయే పదిహేనేళ్ళూ గడుస్తాయి. ముసలితనం వస్తుంది. ఇంత పనికిరాని జీవితం ఎందుకు జీవించడం? మెరుపులా నాకు పరిష్కారం దొరికింది. - ఆత్మహత్య. ఈ ఊహ ఇన్నేళ్ళుగా రానందుకు ఆశ్చర్యం వేసింది. ఇన్ని కష్టాలు పడుతూ కూడా ఈ మనుష్యులు ఎందుకు బ్రతుకుతారు? ఎందుకు ప్లాస్టిక్ పూల తీగ జీవితం కోసం ఎదురు చూస్తారు? దరిద్రులు, బిచ్చగాళ్ళు, దొంగలు, వేశ్యలు, విటులు, బ్రోకర్లు, కుంటివాళ్ళు, గుడ్డి మమకారం, జీవితం అంటే వున్న ఆకర్షణలోని మోసం, దగా నాకు చటుక్కున తెలిసి వచ్చాయి. చాలా కాలం తర్వాత సంతోషం వేసింది. ఓ గొప్ప సమస్యకి సులువైన పరిష్కారం కనుగొన్నందుకు కష్టాలు పడేవాళ్ళందరినీ ఆవేశంగా అరచి, ఎలుగెత్తి పిలిచి చెప్పాలనిపించింది. 'మీ సమస్యలన్నింటికీ ఇదే పరిష్కారం' అని. 'భారత దేశంలో ఎనభై కోట్ల మంది సామూహిక ఆత్మహత్య' అనే హెడ్డింగ్ ప్రపంచంలోని అన్ని దినపత్రికల్లో ప్రింట్ అయి నా కళ్ళ ముందు కదులుతూ వెళ్ళింది. మరి చనిపోవడానికి మార్గం? ఇదొక ప్రశ్నా? ఈ పుణ్య భూమిలో ఎన్నో జీవనదులున్నాయి- దూకటానికి. మూడు సముద్రాలున్నాయి. ఇంకా పర్వత శ్రేణులున్నాయి. ఇంకా ఒళ్ళు కాల్చుకుని, ఉరి వేసుకుని, ఇంకా ఎక్కడ పడితే అక్కడ దొరికే పురుగుల మందులూ, రసాయన పదార్థాలు తినీ, రైలు క్రిందో, బస్ క్రిందో తలపెట్టీ-

అకస్మాత్తుగా నాకు భయం వేసింది. ఇంతమంది చనిపోవటానికి ఇవి సరిపోతాయా? ఇంతమంది చావాలంటే గ్రామాలు, నగరాలు దేశమంతా లంకలా దహనం చేయాలి. దేశమంతా వెలుగుతూ దీపావళి. కాని నేను? నేను ముందుగా ఆత్మహత్య చేసుకోవాలి. లేకపోతే ఉరి వేసుకోడానికి నాకు చెట్టు దొరక్కపోవచ్చు. విషం నా దాకా మిగలకపోవచ్చు. సముద్రంలో దూకడానికి 'క్యూ'లో నుంచోవాల్సి రావచ్చు. రైలు పట్టాల దగ్గర 'హౌస్ ఫుల్' బోర్డ్ పెట్టచ్చు. ఎవర్నీ పిలవకూడదు. ఎవరికీ చెప్పకూడదు. ఈ దరిద్రులూ, భిక్షులూ అంతా రాకముందే నేను చనిపోవాలి. దూరంగా రెండు వెలుగులు కనిపించాయి. దగ్గరౌతున్నాయి. నన్ను విముక్తుడిని చేసే దేవతలు! పరుగెత్తాను. పారిపోవాలి ఈ సమస్య నుంచి. "ఆగండి, నన్ను తీసుకుపోండి" కీచుమన్న శబ్దంతో వాహనం ఆగింది. ఏదో లోకంలోకి పోతున్నట్లున్న నాకు మనుషుల అరుపులు వినిపించాయి.

* * *

చుట్టూతా వున్న నిశ్శబ్దం, తెల్లదనం నేను హాస్పిటల్‌లో వున్నట్టు చెప్పేయి. నా పక్క కుర్చీలో ఖరీదైన బట్టల్లో నా వయసు యువకుడొకడు కూర్చున్నాడు. ఆతృతగా చూస్తున్నాడు. నేను కళ్ళు తెరవగానే అన్నాడు. "చూడండి, నేను వేగంగా వచ్చిన మాట నిజమే. కాని నేను బ్రేక్ వేసేలోగా మీరే కారు క్రిందకి వచ్చేసారు. దయచేసి మీ వాళ్ళు కోర్టులో కేసు వేయకుండా, పోలీస్ రిపోర్టు ఇవ్వకుండా చూడండి. మీకు పాతిక వేలు నష్టపరిహారం ఇస్తాను. అన్నట్లు మీరు అనెంప్లాయిడా? మీ బేగ్‌లో 'ఎంప్లాయ్‌మెంట్ న్యూస్' చూసాను లెండి. మీ సబ్జక్టు ఏంటో చెప్తే సూటబుల్ ఉద్యోగం చూస్తాను. నాకా పవర్ వుంది"

అతనింకా చెప్పకుపోతున్నాడు. నా చెవి దగ్గర మధుర మంజులమైన షహనాయి వినిపించింది. రాధ పెళ్ళి కూతురుగా కనిపించింది. నా ముఖం చూసి ఏమనుకున్నాడో అతను లేస్తూ చెప్పాడు. "మీరేమీ అనుమానించనక్కరలేదు. మీ క్యాస్త కుదుట పడగానే ఆ పనే" అంటూ సెలవు తీసుకున్నాడు.

నా మనసు నిండుగా వుంది. ఇతను నాకు ఉద్యోగం ఇప్పిస్తే మంచిదే. లేకపోయినా నష్టం లేదు. నాకు ఏజ్ రిలాక్సేషన్ వస్తుంది. ఉద్యోగం వచ్చి తీరుతుంది. గది గుమ్మం వైపు చూశాను. ప్లాస్టిక్ పూలతీగ ఒకటి అలంకారంగా వేలాడుతోంది. నేను చేరబోతున్నాను ఆ ప్లాస్టిక్ పూల తీగల్లో. పరిమళం, జీవం లేకపోయినా నిత్య నూతనంగా చిరకాలం వుండే ప్లాస్టిక్ పూలతీగల శ్రేణిలో.

మనం పెద్దవాళ్ళకి పాదాలకి నమస్కారం చేయుటం చిన్నతనంలోనే నేర్చుకుంటాం. కాని ఎవరికి వారు పాదాభివందనం చేసుకునే అవసరం రాదు కనుక అది నేర్చుకోము. నా పాదాలకి నేను నమస్కారం చేయాలంటే ఇప్పుడు మార్గం లేదు. ప్లాస్టిక్ పూల తీగెల్లాగే నేనూ ఇప్పుడు ఆధారం లేకుండా నిలువలేను. అద్దం ముందు సాగిల పడదామనుకున్నా మూడున్నర దశాబ్దాలు నాలో భాగమై, నా ఉద్యోగం కోసం చెప్పలరిగేలా తిరిగి, ఇప్పుడు కూడా నాకు ఉద్యోగం దొరకడం కోసమే నన్ను వదలి వెళ్ళిపోయిన పాదాలు ఎక్కడున్నాయని. - వందనం చేద్దామనుకున్నా కూడా!

ఖాళీగా వున్న కాళ్ళ చివరల నుంచి బలవంతానా దృష్టి మరల్చుకుని కిటికీలోంచి బైటకి సారించాను. బాధా, సంతోషమూ కలిసిన భరించలేని మధురమైన వేదన మనసుని ఆవరిస్తుంటే గట్టిగా కళ్ళు మూసుకున్నాను.

"టాప్...టప్!"

"మీ ఊరి ఎమ్మెల్యే గొప్ప వాగ్ధాటి గలవాడా? ఏం చేశాడేమిటి?"

"అసెంబ్లీలో మూడు మైకులు విరగ్గొట్టాడు మరి!"

—ఉజ్వల ప్రసాద్